



అరకులోయలో దట్టంగా కురుస్తున్న మంచు

రంగవల్లుల హరివిల్లు!

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువతులు
- రకరకాల ముగ్గులతో వెల్లివిరిసిన తెలుగు సంప్రదాయం
- విశాఖలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో, అనకాపల్లిలో ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహణ

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. సంక్రాంతి పండగను పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన' ముత్యాల ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తమలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. టీపీటీ కాలనీలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో నగర పరిధిలోని అనేక ప్రాంతాలకు చెందిన 130 మంది మహిళలు పాల్గొని రంగవల్లులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సంస్కృతి, సంప్రదాయాలను, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన ముగ్గులతో పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం వరకు పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని పెదవాల్తేరు ప్రాంతానికి చెందిన ఆర్.ప్రవీణ గెలుచుకున్నారు. రెండో స్థానంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఎ.సంతోషి, మూడో స్థానంలో ఎస్‌పీడీ కొత్త రోడ్డు ప్రాంతానికి చెందిన కె.నాగమణి నిలిచారు. వీరికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

అనకాపల్లిలో..

ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా వ్యాప్తంగా పలు మండలాల నుంచి మొత్తం 96 మంది మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి పండగను ప్రతిబింబించేలా, తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పలు రకాల ముగ్గులు వేశారు. రకరకాల ముగ్గులతో ఎన్టీఆర్ స్టేడియం గ్రామీణ వాతావరణాన్ని తలపించింది.



విశాఖపట్నం శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు





విశాఖపట్నంలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత ఆర్.ప్రవీణ





అనకాపల్లి ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు

ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత బొదల లక్ష్మి

అనంతరం న్యాయనిర్ణేతలు ప్రతీ ముగ్గును నిశితంగా పరిశీలించి, నిబంధనల మేరకు ముగ్గురు విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతికి అనకాపల్లి గవరపాలేనికి చెందిన బొదల లక్ష్మి (రూ.6 వేలు), ద్వితీయ బహుమతికి అనకాపల్లికి చెందిన సీహెచ్ అన్నపూర్ణ (రూ.4 వేలు), తృతీయ బహుమతికి కశింకోట మండలం బయ్యవరం గ్రామానికి చెందిన కె.యశ్విత (రూ.3 వేలు) ఎంపికయ్యారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన 'డైట్' చైర్మన్ దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు, జీవీఎంసీ 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్ దంపతుల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా నీలావతి, పద్మజ వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ చిరుకానుకలు అందజేశారు.

...మరిన్ని ఫొటోలు, వార్త 7వ పేజీలో

తెల్లారినా మంచు వీడదే!

మన్యంలో సింగిల్ డిజిట్‌కు చేరిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

- జి.మాడుగుల, జీకేవీధిలో 6, అరకులోయలో 6.3 డిగ్రీలు



లంబసింగి-రాజుపాకలు మార్గంలో దట్టంగా కురుస్తున్న మంచు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు దిగజారాయి. దీంతో మన్యం వాసులు వణుకుతున్నారు. జి.మాడుగుల, జీకే వీధిలో 6, అరకులోయలో 6.3, పాడేరు, పెదబయలులో 6.6, హుకుంపేటలో 7, ముంచంగిపుట్టులో 9.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఆదివారం నమోదయ్యాయి. గత మూడు రోజులుగా ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గి, చలి ప్రభావం పెరుగుతున్నది. దీంతో ఉదయం పది గంటల వరకు ఏజెన్సీలో పొగమంచు దట్టంగానే అలముకొంటున్నది. దట్టంగా పొగ మంచు కమ్ముకోవడంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా చలి ప్రభావం తగ్గినా, సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి ప్రభావం పెరుగుతున్నది. తాజా వాతావరణానికి ఏజెన్సీ వాసులు చలి మంటలు వేసుకుంటూ, రగ్గులు కప్పుకొని, ఉన్ని దుస్తులు ధరిస్తూ చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

జీకే వీధి, చింతపల్లిలో...

చింతపల్లి: ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఏజెన్సీ వ్యాప్తంగా పది కంటే తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. ఆదివారం జీకేవీధిలో 6 డిగ్రీలు, చింతపల్లిలో 6.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. సాధారణంగా ప్రతి ఏడాది డిసెంబరు రెండో పక్షం నుంచి జనవరి మొదటి పక్షం వరకు లంబసింగి, చింతపల్లి ప్రాంతాల్లో ఒకటి, సున్న డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఐదు కంటే తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇప్పటి వరకు నమోదు కాలేదు. ఈ సీజన్‌కి చింతపల్లిలో అత్యల్పంగా 6.5 డిగ్రీలు నమోదైనట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం ఏజెన్సీలో ఓ వైపు వణించే చలితో పాటు మంచు దట్టంగా కురుస్తున్నది. చింతపల్లి, లంబసింగి, జీకేవీధి, తాజంగి ప్రాంతాల్లో ఉదయం పదిన్నర గంటల వరకు

... మిగతా 6వ పేజీలో



అంగన్‌వాడీల ఆగ్రహ జ్వాల

చింతపల్లిలో జీవో కాపీలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ జీవో నంబరు-2ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవోను నిరసిస్తూ ఆదివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పాడేరు, చింతపల్లి, అరకులోయ, పెదబయలులో జీవో కాపీలను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.

- వార్త 6వ పేజీలో..

మళ్లీ దొడ్డిదారి బదిలీలు

విశాఖ నగరానికి వచ్చేందుకు తహతహలాడుతున్న టీచర్లు

- రూ.లక్షలు సమర్పించి ఉత్తర్వులు తెచ్చుకుంటున్న వైనం
- కీలక ప్రజాప్రతినిధి సహాయకుడి వసూళ్ల పర్వం
- విశాఖ జిల్లాకు చేరిన బదిలీల జాబితా
- ఖాళీలు లేక విద్యా శాఖ అధికారులు మల్లగుల్లాలు



విశాఖ డీఈవో కార్యాలయం

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖలో మరోసారి దొడ్డిదారి బదిలీలకు తెరలేచింది. ప్రభుత్వంలో పలుకుబడి, దండిగా పైసలుంటే ఎక్కడికి కావాలంటే అక్కడికి బదిలీ జరిగిపోతుందనే ధీమాతో పలువురు టీచర్లు విశాఖ వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

విశాఖ నగర పరిసరాల్లో ప్రస్తుతం సెకండరీ గ్రేడ్ టీచర్ల ఖాళీలు లేవు. స్కూలు అసిస్టెంట్ పోస్టులు రెండు లేదా మూడు ఉన్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యా శాఖ అధికారులు తాజా పరిస్థితిని పాఠశాల విద్యా శాఖకు నివేదించారు. అయినా విశాఖకు రావాలన్న ఆత్రుతతో ఇప్పటికే సుమారు 50 మంది ఉత్తర్వులు తెచ్చుకున్నారని ప్రచారం

... మిగతా 6వ పేజీలో

పర్యాటకుల కోలాహలం

సందర్శకులతో రద్దీగా మారిన పర్యాటక ప్రదేశాలు

(ఆంధ్రజ్యోతి- పాడేరు, న్యూస్ నెట్‌వర్క్)

మన్యంలోని సందర్శనీయ ప్రదేశాల్లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. కార్తీక మాసం ముగిసినప్పటికీ వీకెండ్‌లో భాగంగా ప్రస్తుతం పిక్నిక్‌ల సీజన్ కొనసాగుతున్నది. దీంతో ఏజెన్సీలో ఎక్కడ చూసినా పర్యాటకులు కనిపిస్తున్నారు.



అరకులోయ మండలంలోని మాడగడ కొండల వద్ద మంచు అందాలు

అనంతగిరి మండలంలో బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు పర్యాటక సందడి నెలకొంది. దీంతో అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, గిరి గ్రామదర్శిని, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలవిహారి, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువువేనం మేఘాల కొండ, లంబసింగి, యర్రవరం జలపాతం ప్రాంతాలను అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. గత రెండు వారాలతో పోలిస్తే ఈ వారం పర్యాటకుల సంఖ్య తగ్గింది. వాస్తవానికి వంజంగి హిల్స్‌లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడుతుండడంతో ఈ నెల రెండో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు పర్యాటకుల ప్రవేశాన్ని బంద్ చేశారు. అయితే ఈ విషయం తెలియని దూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఆదివారం వంజంగి హిల్స్ సందర్శనకు వచ్చారు. దీంతో పర్యాటకుల సౌకర్యార్థం వారికి ప్రవేశం కల్పించారు.

అరకులోయలో..

అరకులోయ: పర్యాటకులతో అరకులోయ సందడిగా కనిపించింది. ఆదివారం పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియంతో పాటు మాడగడ సన్‌రైజ్ హిల్స్ వద్ద పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంది. మాడగడ హిల్స్ వద్ద స్థానిక గిరిజనులు ఆసక్తి చూపిన మహిళలకు గిరిజన వస్త్రధారణ చేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే థింసా నృత్య కళాకారులు అలరించారు. వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు ఆ ప్రాంతం కోలాహలంగా కనిపించింది.



డుంబ్రిగుడ మండలం చాపరాయి జలవిహారిలో పర్యాటకులు



చింతపల్లి మండలం చెరువులవేనంలో పర్యాటకుల సందడి

లంబసింగిలో..

చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగిలో పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొన్నది. వీకెండ్ కావడంతో ఆదివారం లంబసింగికి ప్రకృతి ప్రేమికులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఉదయం ఐదు గంటల నుంచి తాజంగి, లంబసింగి జంక్షన్, చెరువులవేనం సందర్శకులతో నిండిపోయాయి. చెరువులవేనంలో శ్వేత వర్ణంలో మంచు మేఘాలు అడవులను తాకుతూ

... మిగతా 6వ పేజీలో

కార్పొరేట్ స్థాయిలో ఐటీడీఏ కార్యాలయం ముస్తాబు

పాడేరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయాన్ని కార్పొరేట్ స్థాయిలో ముస్తాబు చేశామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన ఐటీడీఏ కార్యాలయం, పరిసరాల ఆధునికీకరణ పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునికీకరణలో భాగంగా ప్రాజెక్టు అధికారి చాంబర్, సమావేశ మందిరం, వాహనాల పార్కింగ్, కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. తాజా ఆధునికీకరణ పనులతో ఐటీడీఏ కార్యాలయం కార్పొరేట్ కార్యాలయాలను మించి ఆకర్షణీయంగా మారిందన్నారు. కార్యాలయం ఆవరణలోనే అధికారులు, సందర్శకులకు కారు పార్కింగ్, కార్యాలయం బయట బైక్ పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. కార్యాలయ ప్రాంగణంలో అందమైన మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఉద్యానవన శాఖాధికారులను ఆదేశించారు. తక్కువ సమయంలో ఐటీడీఏ కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దిన గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం.రాజు, డీఈఈ పి.అనుదీప్, ఏఈఈ బి.దేముళ్లును ఐటీడీఏ పీవో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, ఐటీడీఏ ఉద్యానవనాధికారి ఎస్.అశోక్, అకౌంట్స్ అధికారి శ్రీనివాస్‌కుమార్, పద్మాపురం గార్డెన్ మేనేజర్ లకే బొంజుబాబు, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సుందరంగా మారిన ఐటీడీఏ కార్యాలయ భవనం



తాజంగి భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

రాష్ట్రం బాగుపడాలంటే బాబు సీఎం కావాలి

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, జనవరి 7: రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. తాజంగి పంచాయతీ కేంద్రంలో ఆదివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని జగన్‌రెడ్డి పాలనలో ఏ వర్గం ప్రజలు సంతృప్తిగా లేరన్నారు. అభివృద్ధి కుంటుబడిపోయిందని, రాష్ట్రం అప్పుల పాలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఆదివాసీల కోసం ఒక్క పథకం కూడా ప్రవేశ పెట్టిందిలేదన్నారు. టీడీపీ హయాంలో ప్రవేశపట్టిన 15 రకాల పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వైసీపీ పాలన ఎంత గొప్పగా ఉందో చెప్పడానికి గిరిజన ప్రాంత అధ్వాన్న రహదారులే నిదర్శనమన్నారు. గిరిజన ప్రజలు, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఆదివాసీ ప్రజలందరూ సైకిల్ గుర్తుకి ఓటు వేసి చంద్రబాబుకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు నారాయణరావు, మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, పార్టీ నేత ఆంద్రాబు లక్ష్మణ్ పాల్గొన్నారు.

బెదిరింపులు మానుకుని సమస్యలు పరిష్కరించండి

» రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి గిడ్డి వరలక్ష్మి



నిరసన శిబిరంలో మాట్లాడుతున్న ఎస్‌టీయూ ప్రతినిధి గిడ్డి వరలక్ష్మి

పాడేరు రూరల్, జనవరి 7: విద్యా రంగం అభివృద్ధికి కృషి చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ ఏపీ) ప్రధాన కార్యదర్శి గిడ్డి వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల 19వ రోజు సమ్మె శిబిరంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ హామీలను నెరవేర్చాలని కోరుతూ సమ్మె బాటపట్టిన చిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. అలాగే కేజీబీవీ టీచర్లకు టెర్మినేషన్ నోటీసులు, ఎంఆర్పీలకు సోకాజ్ నోటీసులు జారీ చేయడం విచారకమని వాపోయారు. చిరుద్యోగులను బెదిరింపులు, భయభ్రాంతులకు గురిచేయడం మానుకొని సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగ సంఘ నాయకులు అనీల్‌కుమార్, జయరాజ్, సింహాచలం పాల్గొన్నారు.

తెల్లారినా మంచు వీడదే!

... 5వ పేజీ తరువాయి



పాడేరులో ఆదివారం ఉదయం పొగమంచు

సూర్యుడు బాహ్య ప్రపంచానికి కనిపించడం లేదు. దీంతో స్థానిక ప్రజలు చలి, మంచు వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అరకులోయలో..

అరకులోయ: మండలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. దీంతో జనం బయటకు రావడానికే భయపడుతున్నారు. ఆదివారం అరకులోయలో 6.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకావడంతో జనం చలికి వణికిపోయారు. పర్యాటకులు క్యాంప్ ఫైర్ వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందారు.



అరకులోయ ప్రధాన రహదారి పక్కన చలి మంట కాగుతున్న పర్యాటకులు

మళ్లీ దొడ్డిదారి బదిలీలు

... 5వ పేజీ తరువాయి

సాగుతోంది. ఇవి సీల్డ్‌కవర్‌లో జిల్లా విద్యా శాఖకు చేరాయని, డీఈవో వాట్సాప్‌కు కూడా వచ్చాయంటున్నారు. అసలే ఖాళీలు లేని పరిస్థితిలో దొడ్డి దారిన బదిలీ ఆర్డర్లు తెచ్చుకున్న వారిని భర్తీ చేయడానికి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారని సమాచారం.

వారికే దిక్కులేదు!

గత ఏడాది జూలై/ఆగస్టులో దొడ్డిదారిన బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్న వారిలో చాలా మందికి ఇప్పటికీ పోస్టింగులు లభించలేదు. ప్రస్తుతం అసలు ఖాళీలే లేని స్థితిలో తాజా ఉత్తర్వుల మేరకు భర్తీ ఎలానో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఉత్తర్వులు అమలుచేయకుంటే పెద్దల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఈ నెలాఖరులో పదవీ విరమణలు ఉన్నాయి. దొడ్డిదారిన బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్న ఉపాధ్యాయులను ఈ ఖాళీల్లో నియమించాలని యోచిస్తున్నారు. ఇదే అదనుగా ఇక్కడి విద్యా శాఖ సిబ్బందిలో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సొమ్ము చేసుకుంటున్న సహాయకుడు

అడ్డగోలు బదిలీలకు ప్రభుత్వంలో కీలక ప్రజాప్రతినిధి వద్ద ఓ సహాయకుడు చక్రం తిప్పారనే ప్రచారం జరుగుతోంది. బదిలీ కోసం తన వద్దకు వచ్చే టీచర్ల నుంచి ఇతను భారీగానే డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. రైల్వే న్యూకాలనీలో ఉంటున్న ఈ వ్యక్తి ఉత్తరాంధ్రలోని విద్యా శాఖ అధికారులతో నిత్యం టచ్‌లో ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. గత ఏడాది జూన్‌లో టీచర్ల బదిలీలు ముగిసిన తరువాత జూలై, ఆగస్టులో అడ్డదారి బదిలీల పేరిట భారీగా ప్రభుత్వ ఆర్డర్లు తెచ్చిన ఇతను, టీచర్ల నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. కాగా గత ఏడాది జూన్‌లో నిర్వహించిన బదిలీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి చాలామంది విశాఖ, అనకాపల్లి చుట్టూ ఉన్న పాఠశాలలకు రాగా, అదే సంఖ్యలో నగరం, మైదానంలో పనిచేస్తున్న టీచర్లు ఏజెన్సీకి వెళ్లారు. మన్యంలో పనిచేయడానికి ఇష్టపడని వారు డబ్బులు వెచ్చించి మరీ మైదానంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో నగర పరిసరాల్లోకి వచ్చిన ఏజెన్సీ టీచర్లలో కొందరు ఇక్కడ ఇమడలేక సొంత మండలాలకు వెళ్లేందుకు నిర్ణయించారు. వారిని గుర్తించి, పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ నుంచి అనుమతి తెచ్చుకుంటున్నారు. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఇదిలావుండగా విశాఖ పరిసరాల్లోనే పనిచేయాలన్న ఆలోచనతో మరి కొందరు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. గత నెలలో గాజువాక, పెందుర్తి మండలాల్లో పనిచేసే ఇద్దరు టీచర్లు పరస్పర బదిలీల పేరిట ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఇదే దారిలో మరికొందరు టీచర్లున్నారని, వీరందరికీ కీలక ప్రజా ప్రతినిధి సహాయకుడి నుంచి భరోసా లభించిందనే ప్రచారం సాగుతోంది.

ఎస్మాతో అంగన్‌వాడీల ఉద్యమాన్ని ఆపలేరు

» సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

» మన్యంలో కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె.. నిరసనలు

పాడేరు రూరల్, జనవరి 7: ఎస్మాను ప్రయోగించి అంగన్వాడీల ఉద్యమాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 27వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షా శిబిరంలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల ఉద్యమంపై జగన్‌రెడ్డి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా ఎస్మాను ప్రయోగించి జీవో-2ను జారీ చేసి ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తుందన్నారు. ఎస్మా చట్టం శిశు సంక్షేమ శాఖకు వర్తించదన్న విషయం సీఎం జగన్‌కు తెలియక పోవడం విచారకమన్నారు. అంగన్‌వాడీలు ప్రభుత్వానికి భయపడే రోజులు పోయాయని, తిరగబడే రోజులు దగ్గరపడ్డాయన్న విషయం గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎస్మా జీవోను తక్షణమే రద్దు చేయాలని అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. అనంతరం 24 గంటల రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద ప్రభుత్వం విడుదల చేసిన ఎస్మా జీవో-2 ప్రతులను అంగన్‌వాడీలు దహనం చేశారు. ఈ సమ్మెకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ (ఎస్‌టీయూ ఏపీ) ప్రధాన కార్యదర్శి గిడ్డి వరలక్ష్మి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ప్రాజెక్టు నాయకులు భాగ్య, కొండమ్మ, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో...

అరకులోయ: అంగన్‌వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతుండడం దారుణమని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వివి.జయ అన్నారు. మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఎస్మా చట్టం ప్రయోగిస్తూ జారీ చేసిన జీవో ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జయ మాట్లాడుతూ పాదయాత్రలో జగన్ ఇచ్చిన హమీలను అమలుచేయాలని రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే, ఇప్పుడు మాట తప్పి మడమ తిప్పడం సరికాదన్నారు. ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ ఎస్మాను అమలు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫలప్రదమైన చర్చలు జరిపి ఇచ్చిన మాటను నిలబెట్టుకొని అంగన్‌వాడీల సమ్మె విరమింపజేసేలా సీఎం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేత పాంగి వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులుపాల్గొన్నారు.





పాడేరులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు.. అరకులోయ కూడలిలో జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

పెదబయలులో..

పెదబయలు: మండల కేంద్రంలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. ఆదివారం చేపట్టిన నిరసన శిబిరంలో ఎస్మా జీవో-2 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా నేత పి.అప్పలనర్స మాట్లాడుతూ సమ్మెను విచ్ఛిన్నం చేయాలని ప్రభుత్వం రకారకాల ప్రయోగాలు చేయడం సరికాదన్నారు. కేంద్రాల తాళాలు బద్దలు కొట్టించడం, సచివాలయ సిబ్బందితో పోషకాహారాలు అందించేందుకు చర్యలు చేపట్టడం ఇందులో భాగమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సన్నిబాబు, త్రినాథ్, శ్రీను, రామ్‌దాసు, సునీల్, గంగాధరం, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



పెదబయలులో ఎస్మా జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

వైసీపీ ఆరిపోయే దీపం

జగన్ అహంకారానికి భారీ మూల్యం తప్పదు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్

చింతపల్లి, జనవరి 7: వైసీపీ ఆరిపోయే దీపం లాంటిదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. ఆదివారం అంగన్‌వాడీ కార్యకర్తలు దీక్షా శిబిరం వద్ద ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 2 పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అహంకారానికి భారీ మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్నికల ముందు ప్రతిపక్ష నేత హోదాలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని న్యాయబద్ధంగా, శాంతియుతంగా సమ్మె చేపడుతుంటే, జగన్మోహన్‌రెడ్డి ఉద్యమాన్ని అణచివేసేందుకు వ్యవస్థలను ఉపయోగించడం సరికాదన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన వైసీపీ ప్రభుత్వం సమ్మెను బలవంతంగా రద్దు చేయించేందుకు ఎస్మాను ఉపయోగించిందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల పాపం జగన్మోహన్‌రెడ్డికి తగులుతుందని, మూడు నెలల్లో ప్రజలు ఇచ్చే తీర్పులో వైసీపీ ప్రభుత్వం అధికారం నుంచి తప్పుకుంటుందని ఆయన పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డిని అన్ని వర్గాల ప్రజలు గత ఎన్నికల్లో మద్దతు ఇచ్చారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కటీ ఆయన నెరవేర్చలేదన్నారు. 175 సీట్లు సాధిస్తామంటూ జగన్ కలగంటున్నారిని, వాస్తవ పరిస్థితి తెలుసుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం కార్యకర్తలపై ఒత్తిడి తీసుకొచ్చినా సమ్మెను విరమించేదిలేదని స్పష్టం చేశారు. ఆందోళనలు మరింతగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాములమ్మ, సత్యవతి, నాగమణి, భవాని, రాజేశ్వరి పాల్గొన్నారు.

అధికారుల నివాస గృహాలను పూర్తి చేయండి

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్

పాడేరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అధికారుల నివాస గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. స్థానిక రోడ్ల, భవనాల శాఖ ఈఈ కార్యాలయం ముందు నిర్మిస్తున్న అధికారుల నివాస గృహాల నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నివాస సముదాయానికి అవసరమైన రహదారి, ప్రహరీ గోడ, మిగిలిన నిర్మాణపు పనులను మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నివాస భవనాల పనులను పరిశీలించిన ఆయన, నాణ్యతలు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గృహ సముదాయం ప్రాంగణంలో వర్షపు నీరు నిల్వ లేకుండా డ్రైనేజీలు నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈఈ పి.అనుదీప్, ఏఈఈ బి.దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.



నివాస గృహల పనులను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

825 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లు సేకరణ

ఎకో పల్పింగ్ యూనిట్‌లో నాణ్యమైన పార్చిమెంట్ ఉత్పత్తి

ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు సహాయ సంచాలకుడు అశోక్

చింతపల్లి, జనవరి 7: ది విశాఖ ఏజెన్సీ గిరిజన కాఫీ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సంఘం (మ్యాక్స్) ద్వారా 11 మండలాల రైతుల నుంచి 825 మెట్రిక్ టన్ను కాఫీ పండ్లను సేకరించామని ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అశోక్ తెలిపారు. స్థానిక ఏకో పల్పింగ్ యూనిట్‌లో విక్రయానికి సిద్ధం చేస్తున్న పార్చిమెంట్‌ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల నుంచి సేకరించిన కాఫీ పండ్లను ఏకో పల్పింగ్ యూనిట్ ద్వారా నాణ్యమైన పార్చిమెంట్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. గత ఏడాది రైతుల నుంచి 685 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను సేకరించి పార్చిమెంట్ ఉత్పత్తి చేశామన్నారు. ఈ ఏడాది జనవరి ఆరో తేది నాటికి 825 మెట్రిక్ టన్నుల పండ్లను పల్పింగ్ చేయడం జరిగిందన్నారు. నెలాఖరు వరకు పండ్ల దిగుబడి వస్తుందని, రైతులు నాణ్యమైన పండ్లను గ్రేడింగ్ చేసుకుని మ్యాక్స్ సిబ్బందికి అప్పగిస్తే తీసుకుంటామని తెలిపారు. పండ్లను వేరు చేసుకున్నాక మిగిలిన కాయలు, అసంపూర్తిగా పండిన కాఫీ పండ్లను చెర్రీగా తయారుచేసుకోవడం మంచిదన్నారు. మ్యాక్స్ ద్వారా గిరిజన కాఫీ రైతులకు కిలో పండ్లకు రూ.43 ధర చెల్లించామన్నారు. ప్రస్తుతం ఏకో పల్పింగ్ యూనిట్‌లో ఉత్పత్తి చేసిన పార్చిమెంట్ విక్రయించగా వచ్చిన ఆదాయం నుంచి రైతులకు బోనస్ అదనంగా అందజేస్తామన్నారు. గత ఏడాది కిలో పండ్లకు తొలి ధరగా రూ.36 చెల్లించి పార్చిమెంట్ కాఫీ గింజలు విక్రయించిన తరువాత కిలోకు రూ.8 చొప్పున చెల్లించామన్నారు. ఈ ఏడాది రైతులకు మంచి బోనస్ వస్తుందన్నారు. కార్యక్రమంలో మ్యాక్స్ చైర్మన్ సెగ్గె కొండలరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



కాఫీ పార్చిమెంట్ గింజలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్

గిరిజన అభ్యర్థులకు గ్రూప్-2 స్టడీ మెటీరియల్



గిరిజన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

పెదబయలు, జనవరి 7: మండల కేంద్రంలోని గిరిజన ఉద్యోగుల భవనంలో గ్రూప్-2 ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న గిరిజన అభ్యర్థులకు ఆదివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. గిరిజన సంఘం నాయకులతో కలిసి ఎంపీడీవో కిరణ్ మెటీరియల్‌ను అందించారు. ఈ మెటీరియల్ చదవడంతో పాటు యూట్యూబ్‌లో తరగతులను వీక్షిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన చెప్పారు. గిరిజన సంఘం నేత అప్పలనర్స మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఉన్నత స్థాయి విద్యనభ్యసించిన వందలాది మంది గ్రూప్-2కు ప్రిపేర్ కావడానికి మెటీరియల్ లేని పరిస్థితిలో ఉన్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం లేదా ఐటీడీఏ శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మన్నపడాల్, సురేంద్ర, బాలదేవ్, సన్నిబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల కోలాహలం

... 5వ పేజీ తరువాయి

పయనిస్తున్న దృశ్యమాలికలను ఆస్వాదిస్తూ పర్యాటకులు బాగా ఎంజాయ్ చేశారు. మంచు అందాలను కెమెరాలో బంధించేందుకు పోటీ పడ్డారు. లంబసింగి పరిసర పర్యాటక ప్రాంతాలు సాయంత్రం వరకు సందర్శకులతో రద్దీగా కనిపించాయి. లంబసింగి జంక్షన్, లంబసింగి, తాజంగి, భీమనాపల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం చింతపల్లి సీఐ కె.రమేశ్, ఎస్ఐ అరుణ్ కిరణ్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసులు ముందు రోజు నుంచే గస్తీ నిర్వహించారు.



వంజంగి మేఘాల కొండపై ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు

చాపరాయి వద్ద..

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని పర్యాటక ప్రాంతం చాపరాయి జలవిహారికి పర్యాటకులు తరలివచ్చారు. చాపరాయి జలపాతం వద్ద స్నానాలు చేస్తూ సరదాగా గడిపారు. చాపరాయి జలవిహారిలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పరిసర ప్రాంతాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. రాత్రి వేళలో ఫ్లడ్‌లైట్ల నడుమ జలవిహారి పర్యాటకుల మదిని దోచుకుంటుంది.



అరకులోయ: మాడగడలో గిరిజన సంప్రదాయ వస్త్రధారణలో పర్యాటకులు

మేఘాల కొండపై సందడి

పాడేరు రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి మేఘాల కొండ వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పరిసరాల పరిశుభ్రత రీత్యా ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు పర్యాటకుల సందర్శనను తాత్కాలికంగా నిలిపివేసినప్పటికీ, ఆదివారం వేలాది మంది పర్యాటకులు పోటెత్తడంతో ఎకో-టూరిజం సిబ్బంది విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పర్యాటకులు కొండపైకి వెళ్లేందుకు అవకాశాన్ని కల్పించారు. దీంతో పర్యాటకులు పర్వతంపైకి వెళ్లి ప్రకృతి అందాలను తిలకించి ఆనందంగా తిరిగివెళ్లారు. పర్యాటకులు వచ్చిన వాహనాలకు పార్కింగ్ స్థలం సరిపడకపోవడంతో ప్రధాన రహదారి పక్కనే వాహనాలను విడిచిపెట్టి పర్వతంపైకి వెళ్లారు.

☛ సంక్షిప్తంగా..



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరు రూరల్, జనవరి 7: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడింది. వంజంగి పర్యాటక ప్రాంతానికి వచ్చే సందర్శకులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రసాదాన్ని పంపిణీ చేయగా, మధ్యాహ్నం మోదకిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్టు సభ్యులు అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కొట్టగుళ్లి రామారావు, కారం దేముడు, బీవీఎస్. ముకుందరావు, కొండలరావు, రాజు పాల్గొని వందలాది మంది భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ రాష్ట్ర అదనపు సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

అరకులోయ, జనవరి 7: ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌క రాష్ట్ర అదనపు సంయుక్త కార్యదర్శిగా అరకులోయ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో తనకు స్థానం కల్పించారని ఆదివారం ఒక ప్రకటనలో శ్రీనివాసరావు తెలిపారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ నుంచి 118 మంది అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారని, వారి సమక్షంలోనే అదనపు సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. సభ్యులు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చానన్నారు. కాగా శ్రీనివాసరావుకు పాడేరు డివిజన్ ఫారెస్ట్ రేంజ్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ రాక

డుంబ్రిగుడ, జనవరి 7: మండలంలోని లైగండ, తూటంగి పంచాయతీ కేంద్రాల్లో జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం రాజ్యసభ సభ్యుడు రమేశ్ పర్యటించనున్నారని బీజేపీ నియోజకవర్గ నేత బిసాయి మూర్తి తెలిపారు. మండలానికి విచ్చేస్తున్న రమేశ్ కేంద్ర ప్రభుత్వ పథకాలను పరిశీలించి, గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు భాగస్వాములు కావాలని ఆయనకోరారు.

ఎస్మా జీవో ఉపసంహరించుకోవాలి

ముంచంగిపుట్టు, జనవరి 7: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెపై ఎస్మా చట్టాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం, ఆ జీవోను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని శాంతియుతంగా అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మెను ప్రభుత్వం ఎస్మా చట్ట పరిధిలోకి తీసుకువచ్చి నిషేధించడం దుర్మార్గమైన చర్య అన్నారు. జీవో 2ను ఉపహరించుకోవాలని, అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అంగన్‌వాడీల న్యాయ పోరాటాన్ని అణచివేయాలని చూస్తే ఉద్యమం రెట్టింపు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.భీమరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెదబయలు, జనవరి 7: మండలంలోని సీతగుంట కూడలి వద్ద ఆదివారం సాయంత్రం జరిగిం రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. రోడ్డు పక్కన నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని, బొలెరో బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో బొలెరో కింద బైక్ నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో బైక్ పైనున్న అరడకోట పంచాయతీ నిమ్మగుంట గ్రామానికి చెందిన చిక్కుడు మత్స్యరాజుకు బలమైనా గాయాలు తగిలాయి. స్థానికులు అతన్ని హుటాహుటిన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు క్షతగాత్రుడ్ని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ముత్యాల హరివిల్లు

- విశాఖలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీలకు విశేష స్పందన
- భారీగా తరలివచ్చిన నారీమణులు, యువతులు
- విజేతలకు నగదు బహుమతులు ప్రదానం



విశాఖలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూలు ప్రాంగణంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. టీపీటీ కాలనీలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో నగర పరిధిలోని అనేక ప్రాంతాలకు చెందిన 130 మంది మహిళలు పాల్గొని రంగవల్లులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

సంస్కృతి, సంప్రదాయాలను, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన ముగ్గులతో పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది.

విజేతలు వీరే...

పోటీల్లో ప్రథమ బహుమతిని పెదవాల్తేరు ప్రాంతానికి చెందిన ఆర్.ప్రవీణ గెలుచుకున్నారు. రెండో స్థానంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఎ.సంతోషి, మూడో స్థానంలో ఎన్ఏడీ కొత్త రోడ్డు ప్రాంతానికి చెందిన కె.నాగమణి నిలిచారు. వీరికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అదించారు. అంతేకాకుండా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆకర్షణీయమైన బహుమతులను అందించడం ద్వారా వారిని ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ యాజమాన్యం ప్రోత్సహించింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహించారని, ఆసక్తికరంగా పోటీలు సాగాయని పలువురు మహిళలు పేర్కొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక రంగవల్లులు

'డైట్' కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్

అనకాపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా రంగవల్లులు నిలుస్తాయని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్...కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు...పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు...రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించారు. స్థానికంగా 'దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్- అటానమస్)' స్పాన్సర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ కొత్త తరం వారు కూడా పాత తరం సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునే విధంగా సంక్రాంతికి ముందే ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమాభాస్కర్, అనకాపల్లి ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ వెంకట్, రిపోర్టర్లు వెలగా రమణ, భీమరశెట్టి వెంకటేశ్, మద్దాల రాంబాబు, యాడ్స్, సర్క్యులేషన్ విభాగాల నుంచి జాన్సన్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



బహుమమతి ప్రదాన కార్యక్రమంలో మాట్లాడుతున్న డైట్ చైర్మన్ దాడి రత్నాకర్







ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఆర్.ప్రవీణ, సంతోషి, నాగమణికి బహుమతులు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి విశాఖపట్నం బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు. చిత్రంలో ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్‌వీ రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, ప్రకటనల విభాగం ఇన్‌చార్జి ఆర్.శ్రీనివాస చక్రవర్తి, సర్క్యులేషన్ విభాగం ఇన్‌చార్జి సత్యనారాయణ, ఏబీఎన్ ఇన్‌చార్జి ఆర్‌వై నాయుడు వున్నారు.





పోటీల్లో పాల్గొనేందుకు పేరును నమోదు చేసుకుంటున్న మహిళలు, యువతులు

ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉంది

ముగ్గులంటే నాకు ఎంతో ఇష్టం. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' యాజమాన్యం ప్రతి ఏడాది నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి ఏడాది పోటీల్లో పాల్గొంటున్నాను. ఈసారి నాకు ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉంది.

- బొదల లక్ష్మి, ప్రథమ బహుమతి విజేత, గవరపాలెం



ద్వితీయ బహుమతిని అందుకుంటున్న అన్నపూర్ణ

మూడేళ్లుగా పోటీల్లో పాల్గొంటున్నా..

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో ఈసారి నాకు ద్వితీయ బహుమతి రావడం సంతోషంగా ఉంది. గత మూడేళ్లుగా ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గుల పోటీల ప్రకటన రాగానే ప్రాక్టీస్ చేశాను.

- చుక్కా అన్నపూర్ణ, ద్వితీయ బహుమతి విజేత, అనకాపల్లి

ముందే వచ్చిన పండగ

ముగ్గుల పోటీలు ఎక్కడ నిర్వహించినా తప్పనిసరిగా హాజరవుతుంటాను. పండగ వాతావరణంలో జరిగిన ఈ ముగ్గుల పోటీల్లో నాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఎంతో మంది మహిళలు పాల్గొనడం ఉత్సాహాన్నిచ్చింది. నాకు తృతీయ బహుమతి రావడం ఆనందంగా ఉంది.

- కె.యశ్విత, తృతీయ బహుమతి విజేత, బయ్యవరం



తృతీయ బహుమతి అందుకుంటున్న కె.యశ్విత

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకు తీవ్ర గాయాలు

బుచ్చెయ్యపేట, జనవరి 7: భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రోడ్డులోని వడ్డాది జడ్పీ హైస్కూల్ వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న వ్యక్తి తీవ్ర గాయాలకు గురయ్యాడు. వి.మాడుగుల మండలం వీరనారాయణం గ్రామానికి చెందిన తలారి జగదీష్ శనివారం రాత్రి బుచ్చెయ్యపేట మండలం పొలేపల్లిలో జరిగిన వేడుకకు హాజరయ్యాడు. ఆదివారం ఉదయం బైక్‌పై బీఎన్ రోడ్డు నుంచి వస్తుండగా, ఎదురుగా గోవాడ షుగర్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలకు గురైన అతనిని 108 వాహనం ద్వారా విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

39 మద్యం బాటిళ్లు స్వాధీనం

పాయకరావుపేట రూరల్, జనవరి 7: మండలంలోని కేశవరం శివారులో మద్యం విక్రయిస్తున్న దుకాణంపై ఆదివారం పోలీసులు దాడి చేసి 39 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేశవరం శివారులో బి.అరుణకుమార్‌కి చెందిన కిరాణా షాపుపై తమ సిబ్బందితో తనిఖీ చేయగా 39 మద్యం బాటిళ్లు పట్టుబడినట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు ఆయన చెప్పారు. ఈ దాడిలో ఏఎస్ఐ గోవిందరావు పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

కశింకోట, జనవరి 7 : మండలంలోని అచ్చెర్ల గ్రామంలో బెల్టుషాపుపై దాడి చేశామని అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం గ్రామంలో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయగా.. 15 మద్యం క్వార్టర్ బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

సీపీఎం నేత బాలకృష్ణ కన్నుమూత

అనకాపల్లి టౌన్, జనవరి 7: ఉద్యమాల నేత, సీపీఎం సీనియర్ నాయకుడు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ (65) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. గవరపాలెంలోని ఆయన ఇంటి నుంచి పార్థివదేహాన్ని వివేకానందనగర్‌లోని సీపీఎం కార్యాలయం వరకు అంతిమయాత్ర నిర్వహించారు. బాలకృష్ణ సంతాపసభలో టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమాల్లో ఉంటూ ప్రజా పోరాటాల్లో 50 ఏళ్లుగా నిలిచారని వక్తలు పేర్కొన్నారు. అలాగే గవరపాలెంలోని బాలకృష్ణ నివాసానికి డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ వెళ్లి బాలకృష్ణ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. బాలకృష్ణ అనేక సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని రత్నాకర్ పేర్కొన్నారు.



బాలకృష్ణ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న రత్నాకర్

ఏఎంసీకి బాలకృష్ణ పార్థివదేహం

అనకాపల్లి పార్థివదేహాన్ని కుటుంబసభ్యులు ఆంధ్రా మెడికల్ కళాశాలకు అప్పగించారు. చనిపోయిన తర్వాత తన శరీరం పరిశోధనలకు ఉపయోగపడాలని ముందుగానే అంగీకారాన్ని ఇచ్చినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా తన భార్య వరలక్ష్మి కుమారుడు కౌశిక్‌ల ఆమోదం మేరకు జ్యోతిబస్ దేహదాన ప్రోత్సహ సంస్థ ద్వారా ఆంధ్రా మెడికల్ కాలేజి ప్రొఫెసర్ నీరజకు ఆదివారం మధ్యాహ్నం బాలకృష్ణ మృతదేహాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం, ఎం.జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, కేఎం శ్రీనివాస్, బి. రంగారావు, ఆర్. శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, ఎ. రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా సాధికారత, చెకుముకి పోటీలు

ఎస్.రాయవరం, జనవరి 7: మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మహిళా సాధికారత సంక్రాంతి సంబరాలు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. పీఆర్‌టీయూ నిర్వహించిన ఆడపిల్ల చదువు అవనికే వెలుగు అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి డిబేట్ కాంపిటీషన్‌లో రేవుపోలవరం హైస్కూల్ విద్యార్థి సీహెచ్ నాగరాజు మొదటి స్థానంలో నిలవగా, అనకాపల్లి శ్రీచైతన్య విద్యార్థిని మేఘనప్రియ ద్వితీయ స్థానంలోను, పెదగుమ్ములూరు విద్యార్థిని కె. యశస్విని తృతీయ స్థానంలో నిలిచారు. కాలేజ్ లెవెల్‌లో అనకాపల్లికి చెందిన వి. లాశ్యప్రియ మొదటి స్థానంలోను, అడ్డరోడ్డు ఎస్‌వీఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎస్ కమల ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి బహుమతులను జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి. అప్పారావు అందజేశారు. అలాగే జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 20 మండలాల నుంచి 153 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వి.మాడుగుల, తృతీయ స్థానంలో కొరుప్రోలు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి పాయకరావుపేట, అచ్యుతాపురం, అనకాపల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, జిల్లా సైన్స్ అధికారి రాజారావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగాని వరప్రసాద్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, పీఆర్‌టీయూ నేతలు సీతారామరాజు, భద్రరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి చెకుముకి విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

గరుడ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ

నక్కపల్లి, జనవరి 7: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉపమాక క్షేత్రంలో గరుడ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. తొలుత కొండపై వున్న స్వామి నిజరూపానికి, కింద ఆలయంలో వున్న క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి అర్చకులు నిత్య పూజలు, హోమాలు చేశారు. అనంతరం ఇత్తడి గరుడ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, రాజాధిరాజ వాహనంపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో యువీఎస్ రావు, రంగనాథస్వామి,రేజేటి సింగరాచార్యులు, మీగడ ఈశ్వరరావు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై మాఢవీధుల్లో స్వామివారి ఊరేగింపు

స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో పలువురి ప్రతిభ

దేవరాపల్లి/చోడవరం, జనవరి 7 : స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో మండలంలోని కాశీపురానికి చెందిన నలుగురు అద్భుత ప్రతిభ చూపారు. విశాఖలోని రైల్వే మైదానంలో శని, ఆదివారాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీపురానికి చెందిన నెక్కెళ్ల దేముడు 70 సంవత్సరాల షాట్‌పుట్ విభాగంలో, ఐదు కిలోమీటర్ల నడక, వంద మీటర్ల నడకలో ప్రథమ స్థానాల్లో నిలిచారు. 70 సంవత్సరాల విభాగంలో డి.త్రినాథ్ 1500 మీటర్ల పరుగు, ఐదు కిలోమీటర్ల నడక, హైజంప్‌లో ద్వితీయ స్థానాలను చేజిక్కించుకున్నారు. అలాగే 65 సంవత్సరాల విభాగంలో ఆదిరెడ్డి చినకన్నబాబు షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, ఐదు కిలోమీటర్ల నడకలో ద్వితీయ స్థానం, వంద మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, 50 సంవత్సరాల విభాగంలో గడి లక్ష్మి 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, 100 మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులను సొంతం చేసుకున్నారు. విజేతలను అభినందించారు.



విజేతలుగా నిలిచిన కాశీపురం వాసులు

చోడవరం సబ్ రిజిస్ట్రార్‌కు మూడు పతకాలు

ఇదిలావుంటే, ఈ పోటీల్లో చోడవరం సబ్ రిజిస్ట్రార్ బి.గీతాలక్ష్మి సత్తాచాటి మూడు పతకాలను సాధించారు. 45 ఏళ్ల కేటగిరీలో లాంగ్ జంప్‌లో ప్రథమ, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, డిస్కస్‌త్రోలో తృతీయస్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.



పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తుమ్మపాల, జనవరి 7 : వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల యూనియన్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం తుమ్మపాల అన్నపూర్ణ బ్యాంక్ ఆవరణలో జరిగిన యూనియన్ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఏపీసీవోబీ, డీసీసీబీ, పీఏసీఎస్‌లకు మూడెంచల విధానంలో ఉన్నప్పుడు.. అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా జీతాలు ఒకేలా ఉండాలన్నారు. చాలీచాలని జీతాలతో ఉద్యోగుల కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నాయన్నారు. పీఏసీఎస్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా సెక్రటరీ శివరామకృష్ణ, ప్రతినిధులు మళ్ల స్వామి, ఆర్. వెంకటరావు, ఈశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పందెం కోళ్లకు ట్రయల్ రన్

ఎలమంచిలి, జనవరి 7: సంక్రాంతి పండుగ పర్వదినాల్లో నిర్వహించే పందేలకు కోళ్లను సిద్ధం చేస్తున్నారు. కోళ్లకు పోషక విలువలున్న ఆహారాన్ని అందిస్తున్నారు. కోళ్లు ఎలా పోటీల్లో సత్తా నిరూపించుకుంటాయోనని ఇప్పటి నుంచే ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. రానున్న సంక్రాంతి పండుగ రోజుల్లో కోడి పందేలకు ఇప్పట్నుంచే పక్కా ప్రణాళికతో పందెం కోళ్లను పెంచుతున్నారు. వాటి ఆహారపు నియమాలు దగ్గర్నుంచి ఆరోగ్య పరమైన అంశాలు వరకూ స్వయంగా పర్యవేక్షిస్తూ పందెం కోళ్లను కంటిపాపలా రక్షించుకుంటున్నారు.



చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

ఏం జరిగింది..?

కృష్ణాపురం కోళ్లఫారం వద్ద యువకుడి మృతి

మరో యువకుడి పరిస్థితి విషమం

యజమాని విషం పెట్టి చంపేశాడంటున్న కుటుంబ సభ్యులు

శృంగవరపుకోట రూరల్, జనవరి 7: మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో ఉన్న కోళ్లఫారం వద్ద ఆదివారం ఉదయం 6 గంట ల సమయంలో అందులో పనిచేస్తున్న ఇద్దరు యువకులు అపస్మారక స్థితిలో పడిఉన్నారు. ఇది చూసిన కోళ్లఫారం యాజమాని వెంటనే వారిని ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సివేరి రవి(21) అనే యువకుడు మృతిచెందగా, మరో యువకుడు సివేరి రామన్న(20) పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం డొంకపుట్ గ్రామానికి చెందిన రవి, సీతంపేటకు చెందిన రామన్న ఎస్.కోటలో చదువుకునేందుకు వచ్చారు. కృష్ణాపురం లోని కోళ్లఫారంలో పార్ట్‌టైం పనికి కుదిరారు. గత పదిహేను రోజులుగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఫారం యజమాని శేఖర్ శనివారం రాత్రి 11 గంటలకు ఆ యువకులకు కోళ్లఫారం అప్పగించి సీతంపేటలోని తన ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో శేఖర్ తన ఫారం వద్దకు రాగా రవి, రామన్న అపస్మారక స్థితిలో పడివుండటం చూసి నిర్ఘాంతపోయాడు. వెంటనే తేరుకొని వారిని ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవి మృతిచెందగా రామన్న కోమాలోకి వెళ్లడంతో వైద్యులు విజయనగరం రిఫర్ చేశారు. అయితే వీరి పక్కన మద్యం సీసాలు ఉ న్నాయని, మద్యం తాగడం వలన మృతిచెంది ఉంటారని యజమాని శేఖర్ చెబుతున్నాడు. అయితే మృతుడు రవి తండ్రి, రామన్న కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తమ పిల్లలను ఫారం యజమాని వెట్టిచాకిరీ చేయించి విషపు ఆహారం పెట్టి చంపేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పూర్తి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని, రూ.10లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. ఎస్ఐ లోవరాజు మాట్లాడుతూ.. ఈ సంఘటనపై దర్యాప్తు ప్రారంభించామని, పోస్టుమార్టం నివేదిక వచ్చాక వాస్తవాలు తెలుస్తాయన్నారు.



సివేరి రవి(ఫైల్)



ఆర్.రామన్న (ఫైల్)